క్లుప్తంగా

నేడు కోన రఘుపతి ఎన్నికల ప్రచారం

పిట్టలవానిపాలెం: మండలంలోని పలు గ్రామాలలో బుధవారం వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు కొత్తపాలెం గ్రామంలో రోడ్ షో కార్యక్రమాన్ని ప్రారంభించి మంచెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, అల్లూరు, అలకావురం, గోకరాజుపల్లి బోయినవారిపాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, చందోలు గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కోన గెలుపు.. బాపట్ల అభివృద్ధికి మలుపు



పిట్టలవానిపాలెం: కోన రఘుపతి గెలుపు బాపట్ల అభివృద్ధికి మలుపు అని కోమలి సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి అన్నారు. మండలంలోని కోమలి గ్రామంలో బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 99.5 శాతం అమలు చేసి నవరత్నాల రూపంలో సంక్షేమాన్ని ప్రజలకు అందించి ఎన్నికలకు వెళ్తున్నట్లు తెలిపారు. 58 నెలల కాలంలో అన్ని చోట్లా రుణమాఫీలు, ఆర్‌బీకేలు, సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయని మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ గెలుపొందితేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందన్నారు. బాపట్ల జిల్లాను సాధించడంతో పాటు వైద్య కళాశాలను సైతం బాపట్లలో ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతిని మూడవసారి ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



రేపల్లె రూరల్: మండలంలోని రాజుకాల్వ గ్రామానికి చెందిన దేవనబోయిన కృష్ణారావుకు చెందిన 10 ఎకరాల గడ్డివాము ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ మంగళవారం కృష్ణారావును పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, డాక్టర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కూచిపూడి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. అశోక్‌బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. కొల్లూరు మండలంలోని అనంతరం గ్రామంలో టీడీపీ నుంచి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఐదు కుటుంబాలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కాపుల ఆత్మీయ సమావేశం

పెదకాకాని: పెదకాకాని తోట సమీపంలోని ఎస్ కన్వెన్షన్‌లో ఈనెల 8న కాపుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఆ సంఘం నాయకుడు మాదా రాధా తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిదో తేదీ సాయంత్రం 5 గంటలకు ఆత్మీయ సమావేశం ప్రారంభం కానుందన్నారు. ముఖ్యఅతిథులుగా గుంటూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, పొన్నూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు. కాపు నాయకులు సోదర సోదరీమణులు పాల్గొని జయప్రదం చేయాలని రాధా కోరారు. కార్యక్రమంలో పెదకాకాని మండల కాపు నాయకులు తడవర్తి అప్పారావు, పెండెం విజయ్ బాబు, బండి శ్రీను, కేతినేని వరప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి కుటిల రాజకీయాలకు అంతం తప్పదు

- సీఎం జగన్‌ను నేరుగా ఢీకొనలేక చంద్రబాబు కూటమి బాట
- ఎందరు కలిసొచ్చినా ఎన్నికల క్షేత్రంలో జగన్ గెలుపు ఖాయం
- చుండూరు మండలంలోని పలు గ్రామాల ఎన్నికల ప్రచారంలో అశోక్‌బాబు, రావెల కిశోర్‌బాబు



నడిగడ్డవారిపాలెం ఎన్నికల ప్రచారంలో రావెల కిషోర్‌బాబు, అశోక్‌బాబు

నడిగడ్డవారి పాలెం(వేమూరు): ప్రజల జీవన ప్రమాణాలను పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి, నడిగడ్డవారిపాలెం, ఆలపాడు, అంబేడ్కర్ నగర్, చుండూరు, మున్నంగి వారి పాలెం, వేటపాలెం, కేఎస్ పాలెం గ్రామాల్లో రావెల కిశోర్ బాబుతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలు, వృద్ధులను ఓట్లు అభ్యర్థించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ ఒంటరిగా జగన్‌ను ఎదుర్కోలేక ప్రతిపక్ష నేత చంద్రబాబు గుంపులు కట్టి వస్తున్నాడన్నారు. సీఎం జగన్‌కు ఉన్న ప్రజాదరణ ముందు చంద్రబాబు కుటిల రాజకీయాలు సాగవన్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ శివప్రసాద్‌రెడ్డి, కారుమూరి వెంకటరెడ్డి, వుయ్యూరి అప్పిరెడ్డి, ఎంపీపీ జాలాది రూబేను, గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిని, అవుతు సాయిబాబారెడ్డి, కె చిన్న లక్ష్మిరెడ్డి, పార్థ సారథిరెడ్డి, ఎంపీటీసీ అవుతు శివ పార్వతి, తమ్మా బసివిరెడ్డి, తమ్మాపాముల రెడ్డి, తమ్మా వీర సాంబరెడ్డి, అవుతు బ్రహ్మానందరెడ్డి, పులివర్తి అశోక్(మోషే), గ్రామ సర్పంచ్ రాయల సునీత సురేష్, సుబ్బారెడ్డి, అమర్తలూరు సాంబశివరావు, ఈపర్ల ప్రశాంతి, నారాల శెట్టి సురేష్, ఈపర్ల రమేష్, కూచిపూడి బుజ్జి, కూచిపూడి లీలిస్‌బాబు, వునులూరు ఇస్సాక్, పి ధనంజయ్య, కెయస్ పాలెం సర్పంచ్ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రచార పర్వం

గ్రామాల్లో హోరెత్తిన ఎన్నికల ప్రచారం



పిరాట్లంకలో ప్రచార కరపత్రాలను అందజేస్తున్న స్థానిక నాయకులు



రేపల్లె పట్టణం 10వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- మండే ఎండలను సైతం లెక్క చేయకుండా ప్రచారాలు
- కరపత్రాల ద్వారా ఐదేళ్లలో అందిన సంక్షేమాన్ని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు ఐదేళ్ల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలు, పాలనా సంస్కరణలు, అభివృద్ధిని ప్రజలకు మరోమారు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే జగనన్నకు మరోమారు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. మండలంలోని పిరాట్లంక గ్రామంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, నాయకులు దూళిపాళ్ల పుల్లారావు, రేపల్లె పట్టణంలోని 10వ వార్డులో నాయకులు వీరెళ్ల అంజిబాబు, కొండలపల్లి నాగేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి జగనన్న మేనిఫెస్టోను వివరించి బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్‌ను, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రశాంత వాతావరణాన్ని కల్పించండి

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- చేబ్రోలులోని రెండు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ
- సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశాలు



చేబ్రోలు మండలం గొడవర్రులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. చేబ్రోలు మండలం గుండవరంలోని ప్రభుత్వ పాఠశాల, గొడవర్రు యూపీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలు, బందోబస్తు ఏర్పాట్లపై చేబ్రోలు ఎస్సై మహేష్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగు కేంద్రాల వద్ద బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర విధివిధానాలపై క్షుణ్ణంగా పరిశీలించి మార్గనిర్దేశనం చేశారు. పోలింగ్ రోజున కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు మినహా ఎవరూ ఉండకుండా చూడాలని తెలిపారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, టోల్ ఫ్రీ నంబర్ 112కు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి వెంట శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, స్థానిక ఎస్ఐ పి మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వ్యాధి నిర్ధారణ ఫలితాలు సత్వరమే అందించాలి

డాక్టర్ కిరణ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిపై నమ్మకంతో వస్తున్నా రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలను సత్వరమే అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ వైద్య విభాగాధిపతులతో లేబొరేటరీ పరీక్షలు వాటి ఆవశ్యకతపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి రోజుకు నాలుగు వేల నుంచి ఐదు వేల మంది వరకు రోగులు వస్తున్నారని వివరించారు. అందులో రెండు వేల మంది రోగులు ఇన్ పేషంట్‌గా ఉంటున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో గుండె ఆపరేషన్లు, కిడ్నీ, కాలేయం వంటి ఆపరేషన్లు జరుగుతున్నాయని ఈ పరిస్థితులలో ల్యాబ్ పరీక్షలు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలు నిక్కచిగా అందించాలన్నారు. ఆస్పత్రిలో రోగులు 30 నుంచి 40 మందికి పైగా వెంటిలేటర్ పై ఉంటున్నారని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు జరగాలని ఆదేశించారు. ఆస్పత్రి నుంచి రక్త నమూనాలు బయటకు వెళుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని దానికి తోడు ఆస్పత్రిపై దుష్ప్రచారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆసుపత్రికి, మెడికల్ కళాశాలకు చెడ్డ పేరు తీసుకుని రావద్దని కోరారు. అందుబాటులో ఉన్న రక్త వ్యాధి నిర్ధారణ పరీక్షలు సత్వరమే చేసి రోగి కోలుకునే విధంగా సహకరించాలన్నారు.

పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రయోజనం



మాట్లాడుతున్న హెచ్ఆర్ ఫుట్ ప్రింట్స్ సీఈవో రాజ్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలతో పాటు వ్యవస్థాపకులుగా ఎదిగే క్రమంలో ప్రయోజనాలు ఉంటాయని హెచ్ఆర్ ఫుట్ ప్రింట్స్ సీఈఓ, డాక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా సంస్థలను అనుసంధానించడం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న రాజ్‌కుమార్ మాట్లాడుతూ తాము అకడమిక్‌గా అధ్యయనం చేసిన అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించేలా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడమే ఇంటర్న్‌షిప్ అని అన్నారు. తద్వారా విద్యార్థులకు పరిశ్రమల్లోని క్షేత్ర పరిస్థితులపై అవగాహన పొందడమే కాకుండా నైపుణ్యాలు చేకూరుతాయన్నారు. వీటితో పాటు అంతర్గత నైపుణ్యాలు, టీం వర్క్, పనిలో నైపుణ్యం, నిర్ణయాధికారం, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు దక్కుతాయన్నారు. ఇంటర్న్ ట్రైనీగా చూపే ప్రతిభ, పనితీరు సంస్థ యాజమాన్యం మెచ్చే విధంగా ఉంటే పూర్తిస్థాయిలో ఉద్యోగం లభిస్తుందన్నారు. అనంతరం ఇంటర్న్‌షిప్, ప్రాంతీయ భాష, బృందంతో కలసి పని చేసే సమయంలో పైస్థాయి అధికారులతో నడుచుకునే విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరిశ్రమలు తమ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపీ శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎన్ మణికంఠ, బి.అనిత పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ వెన్నంటే నడుస్తాం

భట్టిప్రోలు: ఓ సంఘ సమావేశానికి హాజరైన తనను తెలుగుదేశం పార్టీ సమావేశానికి హాజరైనట్లుగా తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని భట్టిప్రోలు గ్రామ పంచాయతీ 10వ వార్డు సభ్యులు గోలి సుధా శ్రీనివాసరావులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో జరిగిన పద్మశాలీయ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఒక సంఘ సభ్యునిగా తనకు కూడా ఆహ్వానం అందిందని తెలిపారు. కొందరు టీడీపీ వారు పార్టీ సమావేశానికి హాజరైనట్లు చిత్రీకరిస్తూ అసత్య ప్రచారానికి తెరలేపారన్నారు. ఒక సంఘీయుడిగా మాత్రమే సమావేశానికి హాజరయ్యానని ఎటువంటి పార్టీ పరమైన విధి విధానాలతో హాజరు కాలేదని పేర్కొన్నారు. చేనేత కార్మికుల కోసం బృహత్తర కార్యక్రమాలు, సంస్కరణలు ప్రవేశపెట్టి, సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ వెన్నంటే ఉంటానని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

లక్ష్మీపురం: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని తెలుగు పండిట్ రాజన్న మాస్టారు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటరు చైతన్య సభ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పవిత్రమైనదని, పరిపాలన విధానానికి ఆయుధం లాంటిదన్నారు. విశ్రాంత జంతుశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ ఆర్.రామచంద్రరావు, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ చాలామంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, రాజకీయ తంతుగా భావిస్తున్నారని అది సరికాదని చెప్పారు. స్వార్థ రాజకీయాల కోసం కోట్ల రూపాయలు వెదజల్లే వారిని ప్రజాప్రతినిధులు కాకుండా అడ్డుకోవటానికి ఓటే శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. కార్యక్రమంలో రవి మెడికల్స్ శివశంకరరావు, సంస్థ సీనియర్ సభ్యులు ఎస్. విద్యాధర కుమార్, సి.హెచ్.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు.

విజయవాడలో నేడు నరేంద్ర మోదీ రోడ్ షో

గుంటూరు మెడికల్: విజయవాడలో ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోసం బుధవారం రోడ్ షో నిర్వహించనున్నట్లు బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్‌షో పీవీఆర్ మాల్ నుంచి బెంజ్ సర్కిల్ వరకు సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందన్నారు. రోడ్‌షోలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు.

నైపుణ్యాలతో ప్రతిభ నిరూపణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను వెలికితీసినప్పుడే ప్రతిభను నిరూపించుకుని ఉద్యోగాలను సాధించగలరని వేద విజ్ఞాన అకడమిక్ రీసెర్చ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ వి. జ్ఞానసాగర్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో అర్హులందరికీ సంక్షేమం



అద్దేపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు

భట్టిప్రోలు: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దెనెక్కడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కె.పిచ్చయ్యశాస్త్రి, కుందేటి రమేష్, ఎంపీటీసీ సభ్యులు కొఠరపు పద్మావతి, పంచాయతీ వార్డు సభ్యులు అబ్దుల్ కరీమ్, పేరికల శ్యామ్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుల గిరిధర్, దారా చెన్నయ్య, గోలి శ్రీనివాసరావు, టి. వెంకటేశ్వర్లు, బసవయ్య, బుల్లబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

హోరు గాలులు..మోస్తరు వర్షం

- పలు చోట్ల బీభత్సం సృష్టించిన ఈదురు గాలులు
- నేలకొరిగిన అరటి తోటలు



పెదలంకలో నేల కొరిగిన అరటితోట

భట్టిప్రోలు: వాతావరణంలో నెలకొన్న అనూహ్య మార్పుతో మంగళవారం సాయంత్రం సంభవించిన ఆకస్మిక గాలులకు భట్టిప్రోలు మండలంలోని కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా వీచిన గాలులకు అరటి తోటలు నేల వాలాయి. పక్వానికి వచ్చిన అరటి గెలలు నేలవాలడంతో రైతులు లబోదిబో మంటున్నారు. కల్లాల్లో ఆరబోసిన పసుపు వర్షానికి తడిచింది. మొక్కజొన్న కూడా వర్షానికి తడిచిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సాయంత్రం 4:30 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు సరఫరాకు విఘాతం కలిగింది.

బాపట్ల: బాపట్ల జిల్లాలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో చిరు జల్లులు కురిశాయి. మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు వీచాయి. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

అల్లూరి జీవితం భావి తరాలకు ఆదర్శం



కర్లపాలెంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న క్షత్రియులు

కర్లపాలెం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని క్షత్రియ పెద్దలు పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 100 వ వర్ధంతి సందర్భంగా క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం కర్లపాలెం పాలకేంద్రం వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో బ్రిటీష్ వారిని ఎదిరించిన ఘనత అల్లూరికి దక్కుతుందని శ్లాఘించారు. ఎందరో అమర వీరుల ప్రాణ త్యాగాల ఫలితంగా మనకు స్వాతంత్య్రం ప్రాప్తించిందని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వెంకటరామరాజు, హరనాథరాజు, శివాజీరాజు, నరేంద్ర, నాగరాజు, రామరాజు, దీపు, వెంకటపతిరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు



ఉపకారవేతనాలు అందుకున్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, ఫౌండేషన్ ప్రతినిధులు

గుంటూరు రూరల్ : ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు ఎంతగానో దోహదపడతాయని,ఆర్ వీ ఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉపకార వేతనాల చెక్కుల పంపిణీ జరిగింది. కళాశాలకు చెందిన 62 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 25 వేల రూపాయల చెక్కులను నార్త్ సౌత్ ఫౌండేషన్(యూ ఎస్ ఏ) అందించడం హర్షణీయమన్నారు. ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అచ్యుత బాబు మాట్లాడుతూ పేద విద్యార్థి ప్రతిభకు ఆర్థిక భారం సమస్య కాకూడదన్నారు. వారి ఉన్నతే లక్ష్యంగా నార్త్ సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకారవేతనాల పంపిణీ జరుగుతుందన్నారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులను జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో నార్త్ సౌత్ ఫౌండేషన్ విజయవాడ చాప్టర్ కో ఆర్డినేటర్ సూరపనేని వెంకటరత్నం, ఆర్ గోపాల కృష్ణ, డాక్టర్ కె కృష్ణ ప్రసాద్ డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎస్.వి. శ్రీనివాస రావు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో నిజాయతీ పరులను ఎన్నుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని నిజాయతీ పరులను ఎన్నుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఉండాల్సిన అంశాలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేవారిని, పర్యావరణాన్ని కాపాడే వారిని గెలిపించాలని కోరారు. ప్రజలకు ఉపాధి కల్పన, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, మద్యం, మాదక ద్రవ్యాలను నిషేధించేవారినే గెలిపించాలన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేవారిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. జాన్‌బాబు, బి. ప్రసాద్, జి. వెంకటరావు, బి. శంకర్‌సింగ్, ఎం. ఉదయ్‌భాస్కర్, బి. ప్రతాప్‌సింగ్, టీఆర్ రమేష్, బి. ఉదయ్‌భాస్కర్, షేక్ సుభానీ పాల్గొన్నారు.

నేడు భట్టిప్రోలులో ఎన్నికల ప్రచారం

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి, రాత్రి 7 గంటలకు భట్టిప్రోలులో ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ క్యాంప్ కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఈ ఎన్నికల ప్రచారంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఏఎన్‌యూ నేపాల్ వర్సిటీతో ఎంఓయూ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బౌద్ధ అధ్యయన విభాగం నేపాల్‌లోని లుంబినీ బుద్ధిస్ట్ యూనివర్సిటీతో ఎంఓయూ(అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. ఈనెల 4,5 తేదీలలో నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఏఎన్‌యూ బుద్ధిజం విభాగాధిపతి ఆచార్య ఎల్. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లుంబినీ యూనివర్సిటీతో ఏఎన్‌యూకి ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఎంఓయూ పత్రాలను మంగళవారం ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌కు ఉదయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ రెండూ యూనివర్సిటీల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య సాహిత్య, సంస్కృతిక, మేధపరమైన అంశాలపై విస్తృత పరిశోధనలు జరగాలన్నారు. బుద్ధిజంపై విస్తృతంగా అధ్యయనం, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని ఆచార్య ఉదయకుమార్ తెలిపారు. రెండు యూనివర్సిటీలు పరస్పర అవగాహనతో విద్యా, పరిశోధనలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య సంధ్యాకోల్, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.